వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష, పాల్గొన్న అధికారులు

పలకరించని తొలకరి.. చూపులన్నీ నింగికేసి..!

వానాకాలం ప్రారంభమై దాదాపు 25 రోజులు గడుస్తున్నా జిల్లాలో చినుకు జాడ లేక రైతుల్లో కలవరం మొదలవుతోంది. మృగశిర కార్తె నడుస్తున్నా తొలకరి పలకరంచకపోవడంతో ఆకాశం వైపు చూస్తున్నారు. జిల్లాలో ఇంకా గరిష్ట ఉష్ణోగ్రతలే నమోదువుతుండటంతో పంటల సాగుకు నిరీక్షిస్తున్నారు.

ప్రజాశక్తి - రాయచోటి

ఏటా ఈ సమయానికి తొలకరి వర్షాలు పడి రైతులు దుక్కులు దున్నుకునేవారు. పంట పండాలంటే నీరు ఎంతో అవసరం. నీరు కావాలంటే వానలు కురవాలి. అలాంటి వర్షం కోసం రైతన్నలు ఎదురు చూడాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. సాధారణంగా మే చివరి వారం, జూన్ మొదటి వారంలో వాన జాడ కన్పించేది. తొలకరి పలకరిస్తే రైతుల్లో ఉత్సాహం ఏర్పడుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడో వారమైనప్పటికీ జిల్లాలో చినుకు జాడ కన్పించకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 82,589 హెక్టార్లు, వేరుశనగ సాగు చేయాల్సిన విస్తీర్ణం 47,885 హెక్టార్లు ఉంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 52,085 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఏడాది 40 వేల హెక్టార్ల వరకు వేరుశనగ సాగుచేసే సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో వర్షాలు కురిస్తే తప్ప రైతులు సాగుకు ముందుకొచ్చే పరిస్థితి లేదు. వాతావరణ శాఖ తుఫాన్ వస్తుందంటూ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ జిల్లా ప్రాంతమంతా మబ్బులకు అలుముకుంటున్నాయి. కానీ చినుకు రాలిన దాఖలాలు మాత్రం కన్పించడం లేదు. అప్పుడప్పుడూ కల్లాపు చల్లినట్లు చినుకులూ పడుతూ రైతులను ఆశావాహులుగా చేస్తున్నాయి. ఎప్పుడు వాన వస్తుందా, ఎప్పుడు పంటలు వేసుకుందామా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఇది ఇలా ఉంటే మార్చి నుంచి జూన్ నెల వరకు వేసవి తాపం అధికం కావడం భూగర్భ జలాల అడుగంటుతున్నాయి. ఎక్కడ చూసినా తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకొర పడినా బోర్ల కింద వచ్చే నీటితో కొందరు రైతుల మాత్రం పంటలు పండించుకొని ఊపిరి పీల్చుకుంటున్నారు. తీరా పంటలు చేతికొచ్చే సమయంలో అకాలంగా గాలులు రావడం పండిన పంట అంతా నేలకొరగడంతో రైతులు పెట్టుకున్న ఆశ అంతా ఒక్కసారి బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. కొందరు రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించి తమ పొలాల్లో బోర్లు వేయించుకుని అరటి పంట వేసుకున్నారు. కానీ అరటిపండ్ల తీరా చేతికి వస్తుందన్న సమయంలో ఈదురుగాలు రావడంతో అరటి నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవలగా మామిడి పంటలు రైతు ఎంతో ఆశపెట్టుకొని రూ. 10 చేతికొస్తాయి అనుకునే సమయంలో ఈదురుగాలులకు మామిడిపండు దెబ్బతిని నేలరాలడంతో ఉన్న కాయలను తక్కువ ధరలకే మార్కెట్లో రైతులకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట కోసం పెట్టిన డబ్బులు చేతికందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

పంటల సాగుకు రైతులు సన్నద్ధం సిద్ధంగా వేరుశనగ విత్తనాలు

వేరుశనగ వేయాలంటే జూన్ నెలలో రైతులు విత్తనాలను సిద్ధం చేసుకుంటారు. ఇప్పటి నుంచి జులై వరకు వేరుశనగ విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతారు. కానీ చినుకు పడకపోవడంతో రైతులు వర్షం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. జిల్లాలో రాయచోటి, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి ప్రాంతాలలో ఎక్కువగా రైతులు వేరుశనగ పంట వేసేందుకు ఆసక్తి చూపుతారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్న రైతాంగానికి నేటికీ వర్షాలు పడకపోవడంతో ఎదురుచూపులు చూడక తప్పడం లేదు.

వేరుశనగ సాగుకు సిద్ధం చేసుకున్నాం

ఈ ఏడాదిలో వేరుశనగ సాగు చేయడానికి పొలం దుక్కి చేసుకుని సిద్ధం చేసుకున్నాం. మూడు ఎకరాల పొలం ఉంది. గత సంవత్సరం కూడా వేరుశనగ పంటలో నష్టం వచ్చింది. ఈ ఏడాదైనా సకాలంలో వర్షాలు వస్తాయని వేరుశనగ పంట బాగా సాగవతుందని ఆశిస్తున్నాం.

- అబ్బవరం వెంకటరమణ, రైతు, అబ్బవరం, రాయచోటి.

ఆందోళన అవసరం లేదు

వర్షాలు ఇప్పుడే మొదలు అవుతున్నాయి. ఈ వారంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయి. వేరుశనగ విత్తనాలు ఇప్పటి నుండి జులై ఆఖరి వరకు వేసుకోవచ్చు .కావున రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- బి.చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, అన్నమయ్య జిల్లా.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల అవసరాలను తీర్చేందుకు రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీష పిలుపు నిచ్చారు. గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై కలెక్టర్ గిరీష ఆర్‌డిఒలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్‌లు, ఎంపి డిఒలు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్య నారాయణ, గ్రామ, వార్డు సచివాలయ జిల్లా కో-ఆర్డినేటర్ మనోహర్‌రాజు, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ జగనన్న సురక్ష స్పెషల్ ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం నిర్వహణపై సచివాలయ ఉద్యోగులకు, వాలంటీర్లకు శిక్షణ ఇవ్వలని పేర్కొన్నారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు పట్టణ, గ్రామ వార్డుల్లో వాలంటీర్, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రజల సమస్యలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే నుంచి సర్పంచ్, గృహ సారథుల వరకు అందరిని భాగ స్వామ్యం చేయాలని తెలిపారు. క్యాంపు రోజు అన్ని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అధికారులు బాధ్య తాయుతంగా కార్యక్రమ నిర్వహణలో భాగస్వా ములు కావాలని పేర్కొన్నారు. జగనన్న సురక్ష యాప్‌ను ప్రారం భించిన అనంతరం వారం పాటు వాలంటీర్ గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి అమవుతున్న పథకాలకు సంబంధించి ప్రజలకు చర్చించాలని పేర్కొన్నారు. సమస్యలను గుర్తించడంతో పాటు వివరాలను నమోదు చేసుకొని సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లకు ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలపై డిజిటల్ అసిస్టెంట్లు ఈ సర్వీస్ ద్వారా తప్పనిసరిగా సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలన్నారు. డివిజన స్థాయిలో ఆయా ఆర్‌డిఒలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లా మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. శిబిరం నిర్వహణ ముందు నుండి వాలంటీర్లు క్లస్టర్లలో ఇంటింటికీ తిరిగి ప్రజల యొక్క అవసరాలు అనగా కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రం, మరణ ధృవీకరణ పత్రం, వివాహ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుడి ధృవీకరణ పత్రం, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నెంబరు అనుసంధానం, పంట సాగు హక్కు కార్డులను గుర్తించి, అవి పొందుటకు అవసరమైన ధృవపత్రములు తెలియచేసి శిబిరం జరిగే రోజున అందచేయుటకు అవసరమైన చర్యలు తీసుకొనవలసినదిగా ఆదేశించారు. వాలంటీర్లు తమ క్లస్టర్లలో ప్రతి ఒక్కరికి శిబిరం జరిగే తేది, సమయం మరియు ప్రదేశం తెలియ జేయలన్నారు. ప్రభుత్వం సచివాలయాల ద్వారా ముఖ్యమైన 9 సేవలను శిబిరం జరిగే రోజులలో పొందవచ్చని తెలియజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశ్యాన్ని అవగాహన చేసుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ఎటువంటి అలక్ష్యాన్ని సహించబోమని, ప్రజలకు సేవలు అందించే విషయంలో పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని తెలియచేసారు. జగనన్న సురక్ష యాప్‌పై జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ అధికారులకు శిక్షణ ఇచ్చారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

సర్పంచ్ పేరు ముద్రించకపోవడం దుర్మార్గం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని చీకిలబైలు పంచాయతీలో గ్రామ సచివాలయం ప్రారంభం సందర్భంగా ఆవిష్కరించిన శిలాఫలకం మీద సర్పంచ్ ప్రభాకర్ పేరు లేకపోవడం పట్ల టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విచారం వ్యక్తం చేశారు. గురువారం దీనిపై సచివాలయం శిలాఫకం వద్ద సర్పంచ్, టిడిపి నాయకులు, స్థానిక ప్రజలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలాఫలకంలో నిబంధనలు మేరకు సర్పంచ్, అధికారుల పేర్లు చేర్చే విధంగా ఉండాలని, కొత్త శిలాఫలకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై బిసి హక్కుల పోరాట సమితి, వాల్మీకి బోయ సంఘాలతోపాటు, వివిధ రాజకీయ పక్షాలను కలుపుకొని ఐక్య కార్యాచరణ ద్వారా శిలాఫలకములో ప్రోటోకాల్ ప్రకారం పేర్లు నమోదు చేసే వరకు విశ్రమించబోమని ప్రకటించారు. సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ సచివాలయం ప్రారంభంలో ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్ పేరును, సంబంధిత అధికారులు పేర్లు వేయకపోవడం పట్ల అభ్యంతరం తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సరిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లెల నాగరాజు, పెద్దరాశి రామస్వామి, గురికాని కన్నయ్య,దొనబైలు నాగరాజు, మేడిపల్లి శివ, సుధా, మల్లికార్జున, నక్కల రమణ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధికారం చేపట్టి నాలుగేళ్లయిందని, ఈ కాలంలో బిసిలకు అధికార వైసిపి ఏం చేసిందో చెప్పాలని, మదనపల్లెలో బిసిల గొడవలు వెనుక ఎవరున్నారో గుర్తించండని బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ మదనపల్లె మండలం చీకిలబైలు పంచాయతీ సచివాలయం ప్రారంభ శిలా ఫలకంపై బిసి సర్పంచ్ పేరు లేకపోవడానికి వైసిపి బాధ్యత వహించాలన్నారు. సర్పంచుగా ప్రజలచే ఎన్నుకొన్న సర్పంచ్‌ని పక్కన బెడితే దాన్ని ఎవరైనా సమర్థిస్తారా అని ప్రశ్నించారు. కేవలం బిసి కులాలను, వర్గాలను వాడుకొని వదిలేస్తున్నారని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు పెట్టి 700 మందికి ఉద్యోగాలు కల్పించి, ఏ కార్పొరేషన్‌కు ఎంత నిధులు ఇచ్చారని, వీటికి కేటాయించిన నిధులు ఎంత, ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బిసిలపై దాడులు ఆపాలని కోరారు. 72 శాతం ఉన్న బిసిలకు నేడు 25 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉందని ఈ రిజర్వేషన్ చాలదాని గత కొన్ని ఏళ్లుగా గొంతెత్తుతున్న స్పందన లేదన్నారు. 50 శాతం రిజర్వేషనుకు మద్దతు ఇస్తారో ఆ జాతీయ పార్టీతో బీసీల ప్రయాణం కొన సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామలింగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగినేని గోవిందు,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మక్కీ నేని వేణుగోపాల్, ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి అన్నమయ్య జిల్లా కార్యదర్శి బండి రామచంద్ర, డివిజన్ ఉపాధ్యక్షులు గురుమూర్తి, డివిజన్ గౌరవాధ్యక్షులు చంద్రయ్య,రాయలసీమ ప్రచార కార్యదర్శి మణిశంకర్, తాలుకా గౌరవాధ్యక్షులు సీనన్న, రాష్ట్ర గౌరవ సలహా దారులు శేఖర్, రాయలసీమ ప్రచార కార్యదర్శి రెడ్డెప్ప, రమణ, సుబ్బయ్యలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి నాయకులు

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం కావాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కార్పొరేట్ల జేబులు నింపడం కోసం మోడీ, జగన్ జోడీ ప్రభుత్వాలు ప్రజలను దోచుకుంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు విమర్శించారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ పరిధిలో గురువారం విద్యుత్ పోరుబాట పేరుతో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపటం దారుణమన్నారు. అప్పుల కోసం వైసిపి ప్రభుత్వం కేంద్ర విద్యుత్ సంస్కరణలకు దాసోహం అవడం శోచనీయమన్నారు. ప్రపంచంలో సోలార్ విద్యుత్ రేట్లు యూనిట్‌కు రూ.1.50లకు పడిపోయిందని, ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉందని తెలిపారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు, అదనపు కస్టమర్ ఛార్జీలు వివిధ రూపాల్లో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. విద్యుత్ బిల్లులు పరిశీలిస్తే అసలు బిల్లు 5 శాతం ఉంటే, సర్దుబాటు చార్జీలు 82 శాతం, ఇతర చార్జీలు 13 శాతం ఉంటున్నాయని వివరించారు. స్మార్ట్ మీటర్ల వల్ల కార్పొరేట్ కంపెనీలకు తప్ప ప్రజలకు ప్రయోజనం ఏమీలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ, జగన్ కలిసి సామాన్యుల నడ్డి విడుస్తున్నారని, చిరువ్యాపారుల నుండి చిన్న పరిశ్రమల వరకూ ప్రతిఒక్కరూ బాధితులేనని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అన్ని పట్టణాల్లో వర్తక, వాణిజ్య సంఘాలు, కాలనీ అసోసియేషన్లు, పౌర సంఘాలతో కలిసి జూన్ 30న ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే, బాదుడని విమర్శించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి బాదుడులో అందరిని మించిపోయారని విమర్శించారు. విద్యుత్ సంస్కరణలతో కార్పొరేట్ కంపెనీలు బాగుపడ్డాయని, విద్యుత్ రంగం నాశనం అయ్యిందని, ఫలితంగా ప్రజలపై తీవ్రమైన భారాలు పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని, అందుకోసం ఈ నెల 30న జిల్లా వ్యాప్తంగా జరుగు ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామచంద్ర, డి.సి.వెంకటయ్య, కాలనీ వాసులు రామచంద్ర, వేణు, వెంకటరమణ, రమణమ్మ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

జగన్ పాలనలో పేదలకు పెద్దపీట : 'గడికోట'

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జగన్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు, పేదలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రూరల్ మండల పరిధిలోని పెమ్మాడపల్లె గ్రామంలోని గరుగుపల్లె, చిన్న వడ్డెపల్లె, కొత్తపల్లె, పెమ్మాడపల్లె, హరిజనవాడలలో గడప గడపకూ మన ప్రభుత్వంలో మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, ఎంపిపి పల్లపు రాజమ్మ, జడ్‌పిటిసి వెంకటేశ్వరరెడ్డి, బిసి నేత పల్లపు రమేష్, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ప్రతాప్‌రెడ్డిలతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్నింటిలో బిసిలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైఎస్‌ఆర్ చేయూత, నేతన్న హస్తం, రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, ఆటో వాలా లకు ఆర్థి సహాయం, బిసిలకు చెందిన విద్యార్థుల తల్లులకు అమ్మఒడి తదితర పథకాల ద్వారా సింహభాగం బిసిలు లబ్ది పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సిఎం జగన్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్ పాలనలోనే సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. 53 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. నాయీ బ్రాహ్మణులకు దేశ చరిత్రలోనే జగన్ ప్రభుత్వ అరుదైన గుర్తింపు, విలువను ఇచ్చిందన్నారు. మంత్రివర్గం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారితో పాటూ వార్డు మెంబర్ల వరకు బిసి కుటుంబం జన సముద్రంలా ఉందన్నారు. 82 వేల మంది బిసిలు రాజకీయ సాధికారతతో పదవుల్లో ఉన్నారని, బిసిల హృదయంలో జగన్ ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్‌రెడ్డి, తహశీల్దార్ ప్రేమ్ కుమార్, గంగిరెడ్డి, వెంకట నరసింహా రెడ్డి, తిరుపాల్ నాయుడు, దివాన్, పల్లపు శివయ్య, నరసింహులు, భాస్కర్, రామాంజులు, ఆరమాటి గణేష్ రెడ్డి, రజనీకాంత్, మడితాటి రెడ్డెయ్య, కోటకొండ పాపయ్య, వెంకట రమణ, ఆరమాటి రాజారెడ్డి, ముదిశెట్టి రామంజులు, ఆరమాటి విశ్వనాథ, జనార్ధన పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో డిఎస్‌పి బి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, కొకైన్, హెరాయిన్, గుట్కా ,పొగాకు ,ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వలన అనారోగ్యానికి గురై బరువు తగ్గడం, ఆందోళనకు గురికావడం, ఏకాగ్రత కోల్పోవడం, ఆకలి మందగించడం, వంటి దుష్ప్రభావాలకు గురవుతారని వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారి కేంద్ర నాడీ మండల వ్యవస్థ అదుపుతప్పి అనారోగ్యానికి గురై ఆర్థికంగా, మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురై క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు బలవుతారని వివరించారు .కావున యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజంలో మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వలన రోడ్డు ప్రమాదాలు, క్షణికావేశంలో తీసుకునే ప్రమాదకర నిర్ణయాలు వంటి వాటి వలన యువత భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మత్తుపదార్థాల వినియోగ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని , వీటి వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలలోనికి తీసుకెళ్లి చైతన్యం కలిగించాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ యు.థామస్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా సేనో టు డ్రగ్స్ అంశంపై శనివారం పెయింటింగ్, డ్రాయింగ్ వంటి కళాత్మక పోటీలను లైన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి సౌజన్యంతో నిర్వహిస్తామని, ఈ పోటీల యందు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడి నుంచి జింకను కాపాడిన యువకులు

కుక్కల దాడిలో జింకకు గాయాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కన్యకా చెరువులో తాగునీటి కోసం వచ్చిన జింకను కుక్కలు దాడి చేశాయి. రైల్లో వెళ్తున్న ప్రయాణికుడు గమనించి నందలూరు రైల్వేస్టేషన్‌లో ఉన్న యువకులకు సమాచారం అందించడంతో కుక్కలను తరిమి గాయపడిన జింకను నీటి నుంచి బయటకు తీసిన ప్రాణాలు కాపాడారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు జింకను చికిత్స నిమిత్తం వాహనంలో తరలించారు. జింకను కాపాడిన అక్కి హర్షవర్ధన్,జ్యోతి సాయి,శివా, అరవింద్, రంజిత్ మరి కొందరు యువకులను అటవీ శాఖ అధికారులు అభినందించారు.

25న జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి-కడప

ఈ నెల 25వ తేదీన కడపలోని ఎసిఎ స్టేడియంలో అండర్-14, అండర్-16 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్, డిసిఒ ఎస్.కాజామైనుద్దీన్ తెలిపారు. ఆసక్తి కలిగి ఎంపికల్లో పాల్గొనదలచిన క్రికెట్ క్రీడాకారులు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్ రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు ఒక ఫోటో తీసుకురావాలనిన్నారు. జిరాక్స్ కాపీలతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా తమ వెంట తీసుకుని ఎంపికలకు హాజరుకావాలని తెలిపారు. అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు 01-09-2009 తరువాత జన్మించి ఉండాలన్నారు. అండర్-16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొన గలచిన క్రీడాకారులు 01- 09-2007 తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఎవరికి కావాల్సిన క్రికెట్ క్రికెట్ కిట్స్‌ను తెచ్చుకోవాలని తెలిపారు. వైట్ డ్రెస్, షూతప్పనిసరిగా ధరించాలని తెలిపారు.

డిగ్రీ విద్యా విధానంలో వినూత్న మార్పులు : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజ అవసరాలను తీర్చేలా విద్య ఉండాలన్న సంకల్పంతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులతో సింగిల్ మేజర్తో నాలుగేళ్ల డిగ్రీ (అనర్స్) విధానం అమల్లోకి తెస్తున్నామని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. గురువారం వైవీయూలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూను గొప్ప విద్యాసంస్థగా తీర్చిదిద్దాలన్న నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం విసి బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. న్యాక్ ఎ ప్లస్ గ్రేడులో నిలబెట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. యూజిసి బ్యాచిలర్ డిగ్రీ కోసం పాఠ్యాంశాలు, క్రెడిట్ రూపకల్పన డిసెంబర్ 2022లో చేసిందన్నారు. విద్యార్తులు ఇష్టమైన సబ్జెక్ట్ తీసుకుని పూర్తి స్థాయిలో లోతైన అవగాహన పొందేలా డిగ్రీ చదువు రూపొందించామన్నారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా ప్రపంచంలో భారతదేశం గొప్ప మానవ వనరులను అందించే దేశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అకడమిక్ ఎఫైర్స్ డీన్ దాము, సిడిసి డీన్ సుబ్బరాయుడు కోర్సు వివరాలను తెలిపారు. సమావేశంలో వైవీయూ పిఆర్‌ఒ డాక్టర్ ఎస్.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విసి సుధాకర్

రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానవన శాఖ అధికారి నాగమణి

మామిడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-రామాపురం

మామిడి తోటలో కాయల కోత అనంతరం చేపట్టవలసిన సస్యంక్షణ యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖధికారిణి టి.నాగమణి అధ్వర్యంలో మండలంలోని రాచపల్లి, హసనపురం గ్రామాల రైతులకు గురువారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో కాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలను పాటించినట్లయితే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్లకు విశ్రాంతి నిచ్చిన తర్వాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలికి ప్రసరించెల తలపైన కొమ్మలను, తూర్పు పడమర దిక్కులలో ఉన్న కొమ్మలను, ఎండుపుల్ల, చీడపీడలు ఆశించిన కొమ్మలు, తొడిమ కొమ్మలను, ఎండి పోయిన పూత కాడలను కత్తిరించి తొలగించాలని సూచించారు. కత్తిరింపులు చేసిన వెంటనే కోసిన కొమ్మ భాగానికి, చెట్లు పూర్తిగా తడిచెల 3గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని వివరించారు. ఎరువులను చెట్లకు 4 నుంచి 5 అడుగుల దూరంలో చేసిన గాడిలో వేసి మట్టిలో కలిపి నీరు పారించా లన్నారు. జులైలో పచ్చిరొట్టె పైరు జనుము, జిలుగా, పెసర, అలసంద, ఉలవలు, పిల్లిపెసర లాంటి పంటలు వేసి పూత దశలో కలియదున్నాలని సూచించారు. జింక్, బోరాన్ ధాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాముల జింక్‌సల్ఫేట్, 2 గ్రాముల బోరాన్ లీటరు నీటికి లేదా ఫార్ములా-4 పొడిని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2 నుంచి3 సార్లు పిచికారి చేయాలని వివరించారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్ధతిని పాటించాలని అన్నారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్ర సిబ్బంది అఫ్సర్ అలీఖాన్, వెంకటరమణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని సక్రంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ రవి పేర్కొన్నారు. గురువారం గ్రామ చావడిలో డీలర్ల సమావేశం నిరసించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెల అందించే బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు అందాలని చూసుకునే బాధ్యత డీలర్లపై ఉందన్నారు. డీలర్లు అందరికీ ఒక యూనియన్ నాయకుడు తప్పకుండా ఉండాలని ప్రతి డీలర్ షాపులో కూడా ఇసి పనిచేయని వెంటనే తహశీల్దార్ కార్యాలయానికి తీసుకురావాలని సూచించారు. తూకాల కాటాకు రాత్రి సమయంలో చార్జింగ్ పెట్టుకోవాలని, రేషన్ బియ్యం ఇవ్వలేదని ఎలాంటి ఫిర్యాదు రాకూడదని చెప్పారు. అలాంటి ఫిర్యాదులు వచ్చిన వెంటనే వారి పైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ఉన్నటువంటి 44 డీలర్ షిప్‌లలో ఏ ఒక్కరిపై ఫిర్యాదు రాకుండా చూసుకునే బాధ్యత మీపైనే ఉందని సూచించారు. కార్యక్రమంలో విఆర్ఒలు, విఆర్ఎలు, డీలర్లు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను అరికట్టాలని జెసికి వినతి

ప్రజాశక్తి-చిట్వేలు

జెసికి వినతిపత్రం అందిస్తున్న గుత్తి నరసింహ

దళారి వ్యవస్థను అరికట్టి మామిడి రైతులను ఆదుకోవాలని రాజుకుంట పంచాయతీ సర్పంచ్ గుత్తి నరసింహ గురువారం జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్ కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులు సుమారు 11 వేల ఎకరా లలో మామిడి పంటను విస్తారంగా పండిస్తున్నారని అన్నారు. దళారీ వ్యవస్థ నియోజకవర్గంలోని రైల్వేకోడూరులో మామిడి కాయలు యార్డ్‌లో ఒక యూని యన్‌గా చేరి బయట రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారస్తులను రానివ్వడం లేద న్నారు. దళారీ వ్యవస్థ నిర్ణయించిన ధర రైతులకు గిట్టుబాటు కాకపో వడంతో అప్పుల ఊబిలో కూరుకపోతున్నారని అన్నారు. 20 రోజుల క్రితం 30 నుంచి 40 రూపాయలు ఉండే మామిడి కేవలం ఎనిమిది రూపా యల నుంచి పది రూపాయలు ప్రస్తుతం రేటు కేటాయించడం ఈ దళారీ వ్యవస్థకు నిదర్శనమని అన్నారు. మామిడి కాకుండా బొప్పాయి మరి ఏ పంట పండించినా నియోజకవర్గంలో కోడూరు దళారీ వ్యవస్థ చేతిలో బలి కాక తప్పదన్నారు. ఇప్పటికైన ఉద్యానవనశాఖ అధికారులు, వ్యవసాయసాయ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది దళారీ వ్యవస్థతో నష్టపోతున్న రైతుల కష్టాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకోవాలని కోరారు.

జాతరలో పాల్గొన్న చమర్తి జగన్మోహన్‌రాజు

మాతమ్మ జాతరలో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని డిబిఎన్‌పల్లెలో శ్రీమాతమ్మ జాతరను కమిటి జాతర కమిటి సభ్యులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, ద్రోణాచార్య మార్షల్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్ ఆహ్వానం మేరకు నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు జాతరలో పాల్గొన్నారు. మాతమ్మ, గంగమ్మ, రామాలయం దేవాల యాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమ వుతుందన్నారు. అవినీతి రహిత, ప్రజాసంక్షేమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎం.నరసింహులు, రామకృష్ణయ్య, టి.నరసింహులు, యానాదయ్య, సాంబశివ, చంద్రశేఖర్, బాల నరసయ్య, సుధాకర్, టిడిపి మండల సీనియర్ నాయకులు జి.వి సుబ్బరాజు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, విజయ్‌కుమార్ నాయుడు, గోపాల్ నాయుడు శేషారెడ్డి, కేతా రాజశేఖర్, గురునాయుడు పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి ఎపి మోడల్ స్కూల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన 7,8,9, తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 28 తేదీలోగా ఎపిమోడల్ స్కూల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్‌కార్డు, జిరాక్స్ తగు సర్టిఫికెట్లతో పాఠశాలలో హాజరు కావాలన్నారు. పరీక్ష నిర్వహించి విద్యార్థులను మెరిట్ ద్వారా ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 202-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష ఆధారంగా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ లీల శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ చక్కటి అవకాశాన్ని మండలంలోని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్షను ఆదర్శ పాఠశాల ఆవరణ లోనే సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష 50 మార్కులు ప్రశ్నాపత్రం మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ , సైన్స్, సోషల్, మొదలగు సబ్జెక్టులలో ప్రశ్నాపత్రం ఉంటుందని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఆర్‌ఆర్

ప్రజాశక్తి-చిన్నమండెం

రమేష్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవగుడిపల్లె పంచాయతీలో ఇదేంఖర్మ రాష్ట్రానికి, బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమం కోసం వచ్చే ఎన్నికల్లో టిడిపికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారాన్ని చేజిక్కించుకొని రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చారన్నారు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తానని హామీనిచ్చి కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి ఉండడానికి కార్యాలయం, కూర్చోవడానికి కుర్చీ కానీ, బాధలు తీరేదానికి నిధులు గాని విధులు విడుదల చేయ కుండా బిసిలకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. టిడిపి హయాంలో బిసిల కోసం ఆదరణ, ముందడుగు ,చేయూత వంటి అనేక పథకాలతో పాటు స్టడీ సర్కిల్స్, విదేశీ విద్య వంటి అనేక కార్యక్రమాలను చేపట్టి రాష్ట్ర అభివృద్ధికి దోహద పడ్డామని అన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు బిసి, ఎస్‌సి, కాపు, ఎస్‌టి, మైనార్టీలకు సబ్సిడీ పథకాలను ఏర్పాటుచేసిన టిడిపికే దక్కుతుందన్నారు. ఆడబిడ్డలకు ఈ రాష్ట్రంలో రక్షణ కరువై పోయిం దన్నారు. చదువు కున్న యువకులు ఉద్యోగాలు రాక గంజాయి, గుట్కా, మద్యానికి బానిసవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెల్లం నరసింహారెడ్డి, హరి అమర్నాద్‌రెడ్డి ,దిలీప్ కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, కరు ణాకర్, వెంకట్ శివ, వెంకటస్వామి, నాగభూషణ, వెంకటరమణ, పెద్దయ్య, రమణ, సురేంద్ర, గౌరీ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : 'మేడా'



మార్కెట్ యార్డ్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. పసుపు రైతుల సమస్యలపై బోయనపల్లిలో ఏర్పాటు చేసిన డిసిఎంఎస్ పసుపు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను మేడా దృష్టికి తీసుక వచ్చారు. పసుపు ఇచ్చే గిట్టుబాటు ధర సరిపోదని గిట్టుబాటు ధర పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని రైతు సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారని అన్నారు. పసుపు రైతుల గిట్టుబాటు ధర పెంచేందుకు ఉన్నతాధికారులతో చర్చించి పెంపునకు కృషి చేస్తానని రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు పనితీరుపై డిఇఒ పరిశీలన

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ముడియంవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు నాగలక్ష్మమ్మ పనితీరు సరిగ్గా లేదని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం డిఇఒ శ్రీరామ్‌పురుషోత్తమ్ పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయురాలు ప్రవర్తన గురించి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలు పనితీరు సరిగ్గా లేదని విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవరిస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఆమె ఈ పాఠశాలల్లోనే విధులు చేపడితే తమ పిల్లలను వేరే పాఠశాలకు చేర్పిస్తామని, టిసిలు ఇవ్వాలని కోరారు. స్పందించిన డిఇఒ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ మనీంద్రనాయక్, సిఆర్‌పిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఇఒ

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం భూ సేకరణ

ప్రజాశక్తి-పీలేరు

స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం

సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న పీలేరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థల సేకరణ అంశం ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. ఆ అంశంపై దృష్టి సారించాలని తహశీల్దారు ధనుంజయులును జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ ఆదేశించడంతో గురువారం స్థల సేకరణ అంశంలో కదలిక మొదలైంది. తహశీల్దారు ఆదేశాల మేరకు మండలంలోని వేపుల బైలు, దొడ్డిపల్లె, ముడుపులవేముల గ్రామ సచివాలయాల సర్వేయర్లు, విఆర్‌ఒలు, పీలేరు-మదనపల్లె మార్గంలోని ఎపిఐఐసి లేఅవుట్‌లో 30 ఎకరాలను గుర్తించేందుకు గురువారం ఉదయం పనులు ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా కేవలం ఎన్నికల హామీగా మిగిలిపోయిన పీలేరులో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. పీలేరు ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్కులో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు చేస్తామని 2014 నుంచి అనేకమంది రాజకీయ నేతలు పలు మార్లు హామీలు గుప్పించారు. జిల్లాల విభజన తరువాత ఏర్పాటు చేసిన అన్నమయ్య జిల్లా వ్యవసాయ మండలిలో సభ్యుడు బోధిషావలి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుపై పలుమార్లు సలహా మండలి అధ్యక్షుడు సుకుమార్ రెడ్డితో కలిసి జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎపిఐఐసి లేఅవుట్‌లో పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైన ప్రదేశం గుర్తించాల్సిందిగా గతంలో కలెక్టర్ పిఎస్ గిరిష పీలేరు తహశీల్దారు రవిని ఆదేశించారు. ఈనెల 19న తలుపులలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసిన మామిడి, ఇతర పండ్ల కలెక్షన్ సెంటర్లను జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా బోధిషావలి మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు పరిధిలో దాదాపు 300 కోట్లతో మామిడి, జామ, దానిమ్మ, బొప్పాయితో పాటు మరికొన్ని పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అది పీలేరులో కార్యరూపం దాల్చిందని వెల్లడించారు. భూ సేకరణ పూర్తయిన వెంటనే వాటి పనులు ప్రారంభమవుతాయని, ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు అయితే ఈ ప్రాంతంలోని పంటలకు మంచి ధరలు లభించడమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

స్టాఫ్‌నర్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్ వరలక్ష్మి అందించిన సేవలు అభినందనీయమని వైద్యాధికారి డాక్టర్ కిరణ్, గైనకాలజిస్ట్ డాక్టర్.హసీనా, ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్లు నక్కా మహేష్, కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. 11 సంవత్సరాల పాటు ఇక్కడ వైద్య సేవలందించిన వరలక్ష్మి పుంగనూరు బదిలీ కావడంతో గురువారం ఆమెను వైద్యులు, వైద్యసిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు ఆమె అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అనంతరం స్టాఫ్‌నర్స్ వరలక్ష్మి మాట్లాడుతూ బి.కొత్తకోటతో తనకు విడదీయరాని అనుబంధం ఏర్పడిందని,11 సంవత్సరాలపాటు ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లడం చాలా బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 108 పైలట్ రాజు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సమీపంలో భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జనసేన రాష్ట్రకార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రతో కలసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన దినేష్‌కు జనసేనపార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రెడ్డి రాణి, రూప, పంద్రా రంజిత్, జోగినేని మణి, ఉగ్రణం హేమంత్, నంసింహ, హరికృష్ణ, శ్రీనివాసులు, రాజా, రవి, చిన్న, నాగార్జున, శంకరయ్య, వెంకటేష్, నాగేష్, సలీం, ప్రశాంత్, మస్తాన్ రాయల్ పాల్గొన్నారు.

28న బి.కొత్తకోట మండల సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 28న బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం లో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

టికెట్ల ధరల పెంపుపై అభ్యంతరాలుంటే తెలపాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని తవళం గ్రామంలోని శైవక్షేత్రమైన శ్రీ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆర్జిత సేవా టికెట్ల ధరల పెంపుదలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఆలయ కార్యనిర్వహణాధికారిణి మంజుల తెలిపారు. గురువారం వారు నేలమల్లేశ్వర స్వామి దేవస్థానను సందర్శించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయం వద్ద చేయు అభిషేక, ప్రత్యేక పూజ కార్యక్రమాల ఆర్జిత సేవ టికెట్ల ధరలను పెంపుదల చేయాలని నిర్ణయి సదరు విషయమై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే జూలై 1వ తేదీ లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అభిషేక పూజ రూ.500, ప్రత్యేక దర్శనం రూ.50లకు పెంచుతున్నట్లు తెలిపారు. పెంపుదల చేయు సేవా టికెట్ల ధరల పూర్తి వివరాలు ఆలయం వద్ద, వాల్మీకిపురం దేవస్థాన కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శించామని తెలిపారు.

నవోదయకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పీలేరు

ఈ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరైన పీలేరు ఎస్‌వి. శిక్షణా కేంద్రం విద్యార్థుల్లో ముగ్గురు ఎంపిక య్యారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కె. మనోరంజిత నాయుడు తెలిపారు. గురువారం వెలువడిన నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ శిక్షణా కేంద్రం ద్వారా 6వ తరగతి ప్రవేశానికి శిక్షణ పొందిన విద్యార్థుల్లో కె.అనిల్ కుమార్, బి.రెడ్డిధనుష్ ఎంపికయ్యారని తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి ఎస్.హేమాశ్రీ ఎంపికైనట్లు చెప్పారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని శ్రీ శివపార్వతి హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గొట్టం మహేష్, సుకుణాల నిహారిక నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సోము బాలాజీబాబు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను గురువారం నాడు పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులను సత్కరించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-చిట్వేలి

మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధర్‌రావు

మండల పరిధిలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు పరిశీ లించారు. వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన వాహ నాలను, దశాబ్దం పైబడినటువంటి పురాతనమైన పోలీస్‌స్టేషన్‌ను పరి శీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, బైక్ రైడర్స్ ఒకే వ్యక్తి రెండవ సారి పట్టుపడితే వారిపై జరి మానాతో పాటు శిక్ష కూడా ఉంటుందని అన్నారు. సరిహద్దు ప్రాంతమైన చెక్‌పోస్టు వద్ద నిఘా ఉంచామన్నారు. దుకాణ దారులు వినియోగించే సిసి కెమెరాలు రోడ్డు వైపు కూడా ఉండేలా సహకరిం చాలని, కొత్త వ్యక్తులు సంచరించిన వెంటనే వారిని పట్టుకునేందుకు వీలుంటు ందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే కఠిన చర్యలు తప్పవు అన్నారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని దాని ద్వారా ప్రమాదం ఉన్నప్పుడు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. అనంతరం ఇటీవల వివా దాస్పదంగా మారిన పోలోపల్లి శ్రీరాముల ఆలయాన్ని అక్కడ పరిస్థితులు పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ ఎన్ నరసింహారావు, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, ఎఎస్ఐ యంగయ్య, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, పిసిలు రవి, మహేష్, సుధాకర్, రెడ్డయ్య మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం

అసంపూర్తి పనుల నివేదికలను పంపండి : డిఇఒ

ప్రజాశక్తి -కలకడ

పాఠశాలల్లో అసంపూర్తి ఉన్న పనులపై నివేదికలను పంపాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌ను డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం ఆదేశించారు. గురువారం మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ఏడాది రావాల్సిన జగనన్న విద్యా కానుకలు పరిపూర్ణంగా వచ్చాయా లేదా అని ఆరాతీశారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, బూట్లు రాలేదని ప్రిన్సిపల్ డిఇఒ దృష్టికి తీసుక రావడంతో వీలైనంత త్వరగా వచ్చేందుకు చర్యలు చేపడ తామన్నారు. ఆదర్శ పాఠశాలలో బాలికల కోసం నిర్మిస్తున్న భవనం, ప్రహరీ గోడ నిలిచిపోవడంతో వాటిపై నివేదికలను తయారు చేసి వెంటనే పంపాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డును పరిశీలించి, మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మలంషావలి, సిఆర్‌పిలు శ్రీకాంత్, గిరిబాబు, చంద్రకళ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్యను అభ్యసించాలని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం మండలంలోని స్థానిక మాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉపాధ్యాయుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉండాలన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని తిరిగి విద్యార్థి దశ రాదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుక రావాలన్నారు. మత్తుపదార్థాలకు బానిస కాకుండా విద్యాబుద్ధులు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత ఆశయాలు సాధించేందుకు అవకాశాలు ఉన్నాయని సూచించారు. ప్రతి విద్యార్థి మంచి స్నేహాన్ని కలిగి చెడు అలవాట్లకు దూరంగా ఉండి మెలగాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు సరస్వతి, ఎఎస్ఐ బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-బి కోడూరు

తమకు 'ఉపాధి' కూలి చెల్లించాలని మండలంలోని మున్నెళ్లి గ్రామపంచాయతీలో కూలీలు కోరుతున్నారు. నాలుగు వారాల నుండి కూలి డబ్బులు జమ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన ఎండల్లో పని చేశామని, నాలుగు వారాల నుంచి డబ్బు జమ కాలేదని వాపోతున్నారు. సిబ్బందిని అడిగితే మస్టర్ వివరాలు ప్రభుత్వానికి పంపామని, డబ్బులు జమ అయ్యేది తమ చేతుల్లో లేదని అంటున్నారని తెలిపారు. డబ్బులేక కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలి జమ చేయించాలని వారు కోరుతున్నారు.

1 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

చక్రాయపేట : జులై 1వ తేదీనుంచి జగనన్న సురక్ష శిబిరాలను ఆయా గ్రామాల సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శివారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ శిబిరాల ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా పొందవచ్చునన్నారు. జూలై 1న మారేళ్లమడక, 3న మహాదేవపల్లె, 5న నెరసుపల్లె. 7న కల్లూరుపల్లె, 10న కె.ఎర్రగుడి, 12న కుప్పం, 14న చిలేకాంపల్లె, 18న సురభి-1, 20న సురభి-2, 22న కుమారకాలువ, 25న చక్రాయపేట గ్రామ సచివాలయాల్లో శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటి వద్దకు వచ్చే వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపిడిఒ కోరారు.

డిగ్రీలో సింగిల్ మేజర్ ప్రోగ్రాంపై అవగాహన

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ పురుషుల కళాశాల కడపలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిగ్రీలో సింగిల్ మేజర్ ప్రోగ్రాంపై ఈనెల 24వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, రసాయన శాస్త్ర విభాగాధిపతి జె.వెంకటలక్ష్మి తెలిపారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు గాని వారి తల్లిదండ్రులకు గాని, ప్రస్తుతం ఉన్న త్రీ మేజర్స్ ప్రోగ్రామ్ స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్ గురించి సరైన అవగాహన లేనందున ఈ సింగిల్ మేజర్ ప్రోగ్రాం, మైనస్ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

ప్రజాశక్తి-పెండ్లిమర్రి

మండలంలోని పాపాగ్ని నది పరివాహక గ్రామంలో నిత్యం అధికార పార్టీకి చెందిన నేతలు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం తహశీల్దారు ఉదయ భాస్కర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ తుమ్మలూరు, కొండూరు, ఉలవలపల్లి ప్రాంతంలో పాపాగ్ని నది నుండి మండలంలో ఉన్న వైసిపి నాయకులు తమ పలుకుబడి ఉపయోగించి రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా తమ పొలాల వద్దకు, ఇండ్ల వద్దకు ట్రాక్టర్ల ద్వారా తరలించి తర్వాత టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పెండ్లిమర్రి మండల పార్టీ అధ్యక్షులు, తెలుగు యువత అధ్యక్షులు తాతిరెడ్డి రామగంగి, రెడ్డి చీమల పెంట సర్పంచ్ మంగ్లీ ప్రతాప రెడ్డి, మాజీ తెలుగు రైతు అధ్యక్షులు ఓబుల్ రెడ్డి, నాయకులు కోటేశ్వర్ రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ఎరుకల రెడ్డి, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

తప్పులతడకగా ఓటర్ల జాబితా : టిడిపి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీకి సంబంధించిన ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారిందని బి.కొత్తకోట మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు కుడుము శ్రీనివాసులు ఆరోపించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఓటరు జాబితాలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. ఒకే వ్యక్తిపై రెండు ఓటరు కార్డులు ఉంటడం, ఒకే కుటుంబంలోని ఓటర్లు ఒక వార్డులో కొందరు, ఇంకో వార్డులో మరికొందరు జాబితాలో ఉన్నారని పేర్కొన్నారు. ఓటరు జాబితాను వైసిపి నాయకులు తమ కనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా టిడిపి సానుభూతిపరుల ఓట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారని అన్నారు. మండల పరిధిలోని ఓటర్ల జాబితాను సరి చేయాలని తహశీల్దార్‌ను కలసి వినతి పత్రం అందించారు.

తహశీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న టిడిపి నాయకులు